లేఖలు రాద్దాం ఆత్మీయంగా..

- ఉత్తమ ఉత్తరానికి బహుమతి
- లేఖా రచనలో పోస్టల్ శాఖ పోటీలు
- విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా జాతీయ, రాష్ట్రస్థాయిల్లో నిర్వహణ

ఉభయ కుశలోపరి.., నేను పలానా.. నీవు క్షేమంగా ఉన్నావని తలుస్తా.., హాయ్‌రా ఏంచేస్తున్నావు. బాగున్నావా.. ఆరోగ్యం బాగుందా.., ఏమోయ్.. ఏంచేస్తున్నావ్.. పిల్లలు ఎలా ఉన్నారు. చంటిది ఆడుకుంటోందా.. పెద్దాడు బాగానే చదువుతున్నాడా.. వచ్చేనెలలో వస్తాను. ఎక్కడికైనా టూర్ వెళ్లొద్దాం.. ఇలా వివిధ సందర్భాల్లో ఆత్మీయులు.. అయినవారికి రాసే ఉత్తరాల్లోని ప్రారంభ వాక్యాలు చూడగానే చదువరులకు ఎంతో ఆనందం. మరెంతో ఉత్సాహం.. కన్నుల్లో ఆర్ధ్రత.. తమ వారే చదువుతున్నట్టు.. వారు చదువుతుండగా తాము వింటున్నట్టు.. అందుకున్న లేఖలను గుండెలకు అదుముకొని కొందరు.. అపురూపంగా దాచుకుని మరికొందరు.. రిప్లై ఇవ్వడానికి పక్కనే పెట్టుకుని ఇంకొందరు. ఈ అద్భుత భావనలను ఈ తరం ఎంతో కోల్పోతోందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఆధునిక కాలంలో పంపుకొనే ఈ మెయిల్స్, ఎస్ఎంఎస్‌లలో కొరవడుతున్నది ఆ మనసు తడే. ఆ మనసు తడిని ప్రతిబింబించే శైలీలు ఎన్ని ఉన్నా ఆ లేఖ సాగే సరళితో పోలిస్తే అవన్నీ దిగదుడుపే. మళ్లీ ఒకసారి మన వారికి.. ఆత్మీయులికి.. ఓ లేఖ రాద్దామా.. ఆలస్యం ఎందుకు తీయండి కాగితం.. పెన్నూ..

బాలాజీచెరువు: మనసులో భావాలు లేఖపై పెట్టి అందమైన దస్తూరితో కావలసిన వారికి చేరవేయడం ఈ తరానికి తెలీనే తేలీదు. సెల్‌ఫోన్, మేసేజ్, ఈ–మెయిళ్లు, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టా వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం ఆధునిక కాలంలో మామూలైపోయింది. మరి కాలం మారింది కదా.. సాంకేతికతా మారుతోంది. అందుకే ఉత్తరాన్ని గుర్తు చేద్దామని తపాలాశాఖ తలపెట్టింది. లేఖరులకు పోటీ పెడుతుంది. వీటిపై విద్యార్థులకు అవగాహన కల్గించడానికి తపాలాశాఖ అడుగులు వేస్తోంది.

డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాధాన్యం తగ్గింది. దూర ప్రాంతాల్లో ఉన్నవారి క్షేమం తెలియజేయాలన్నా, వ్యాపార అవసరాల నిమిత్తం సమాచారం పంపించాలన్నా ఒకప్పుడు పెన్ను, పేపర్ తీసుకుని లేఖలు రాసేవారు. ఇప్పుడా పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ఒకప్పటి సమాచార సాధనాన్ని నేటి తరానికి తెలియజేయడానికి తపాలాశాఖ లేఖ రచన పోటీలకు శ్రీకారం చుట్టింది. 'డిజిటల్ యుగంలో లేఖా రచన అవశ్యకత' అంశంపై లేఖల పోటీలకు ఆహ్వానం పలుకుతోంది.



కాకినాడలోని తపాలా కార్యాలయం

అర్హులు ఎవరంటే...

భారత దేశ పౌరులై ఉండాలి. వయో పరిమితి లేదు. 18 ఏళ్ల లోపు ఒక కేటగిరి, 18 ఏళ్లు పైబడిన వారిని మరో కేటగిరిగా విభజించారు. తెలుగు, హిందీ, ఆంగ్లం భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను పొందుపరచాలి. చేతితో రాసిన వ్యాసం మాత్రమే అనుమతిస్తారు. ఎన్వలాప్ కవర్ అయితే వెయ్యి పదాలు మించకుండా, ఇన్‌లాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది. ఇలా రాసిన ఉత్తరాలు ది పోస్టల్ సూపరింటెండెంట్, ప్రధాన తపాలా కార్యాలయం. కాకినాడ చిరునామాకు డిసెంబర్ 14వ తేదీలోగా పంపాలి.

బహుమతులు

విభాగాల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలను ఎంపికచేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి 3 స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతి అందజేస్తారు. సర్కిల్ స్థాయిలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా 25 వేలు, 10 వేలు, ఐదు వేలు అందజేస్తారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారికి జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో విజేతలకు ప్రథమ స్థానం 50 వేలు, ద్వితీయ 25వేలు, తృతీయ స్థానం రూ.10వేలు అందజేస్తారు.

విద్యార్థులకు మంచి అవకాశం..



విద్యార్థులకు ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల ఉత్తరాన్ని పరిచయం చేసినట్లవుతుంది. వారిలో పోటీతత్వం పెరుగుతుంది. డిజిటల్ యుగంలో వారి చేతి రాతతో ఉత్తరాలు రాయడం అంటే చాలా మందికి తెలియదు. ఉత్తరాలు రాసే అలవాటు పెరుగుతుంది. ముఖ్యంగా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

తురగా సూర్యారావు, విశ్రాంత తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

క్లుప్తంగా

పాఠశాలను సందర్శించిన డీఈఓ



వాకలపూడి మెయిన్ స్కూల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ రమేష్

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి గ్రామ పంచాయతీ ఎదురుగా ఉన్న మండల పరిషత్ మెయిన్ స్కూల్‌ను డీఈఓ పిల్లి రమేష్ మంగళవారం సందర్శించారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాలు బోధన, సిలబస్ తదితర వాటిపై ఆరా తీసి పలు సూచలను ఇచ్చారు. హెచ్ఎం కర్రి అప్పలరాజు, ఉపాధ్యాయిని సింహాద్రమ్మ డీఈఓకు వివరాలు తెలియజేశారు.

ఘనంగా సత్య వ్రతాలు



రమణయ్యపేటలో సత్యవ్రతాలు చేస్తున్న మహిళలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో షిర్డి సాయిబాబా ఆలయం వద్ద మంగళవారం సత్యవ్రతాలు ఘనంగా నిర్వహించారు. సాయిబాబా పుణ్య తిథి నవరాత్రులను పురస్కరించుకుని ఆలయ నిర్వాహకుడు ఉదయ్ భాస్కర్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు పుణ్య తిథి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మహిళలతో సత్య వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు పూజా సామాగ్రిని అడబాల రత్న ప్రసాద్ సమకూర్చారు.

రూ.పది నాణేలు పంపిణీ



నాణేలు పంపిణీ చేస్తున్న యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ కృష్ణమాచారి

బోట్‌క్లబ్: రిజర్వ్‌బ్యాంక్ ఆదేశాల మేరకు రూ.10 నాణేలు చలామణీ పెంచేలా రెండు రోజులుగా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆ నాణేలు పంపిణీ చేశారు. స్థానిక ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని అన్ని బ్యాంకు శాఖలకు నాణేలు పంపిణీ చేసినట్లు బ్యాంకు రీజనల్ హెడ్ కృష్ణమాచారి మంగళవారం తెలిపారు. రూ.10 నాణేలు చెల్లవని ప్రజల్లో పెద్ద ఎత్తున అపోహ ఉందని, అది తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కరెన్సీ చెస్ట్ ఇన్‌చార్జ్ రామకృష్ణ పాల్గొన్నారు.

చెత్తశుద్ధి చేసి చూపరూ!



కరణంగారి సెంటర్‌లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్ నుంచి చెల్లాచెదురుగా పడిన చెత్త

బోట్‌క్లబ్: నిత్యం డంపర్‌బిన్‌లో చెత్త తీయాల్సి ఉండగా కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది రోజులు తరబడి అలాగే వదిలివేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో రోడ్డుపై వెళ్లేవారు సైతం ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక కరణంగారి సెంటర్‌లో ఏర్పాటు చేసిన డంపర్‌బిన్ నిండిపోయి చెత్త రోడ్డుపై పడుతోంది. ఈ చెత్తలో ఉన్న ఆహార పదార్థాలు తినేందుకు వచ్చే పశువులు, కుక్కలు అక్కడ పరిస్థితిని మరీ అధ్వానంగా చేస్తున్నాయి. డంపర్‌బిన్ నిండిపోతే చుట్టుపక్కల ప్రజలు చెత్త ఎక్కడ వేయాలని ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పందించి డంపర్‌బిన్‌లోని చెత్తను నిత్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్:	విశ్వం, వేట్టయాన్, దేవర, జనక అయితే గనక
దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్:	దేవర, వేట్టయాన్, మా నాన్న సూపర్ హీరో
లక్ష్మి:	దేవర
సత్యగౌరి:	మా నాన్న సూపర్ హీరో
తిరుమల:	వేట్టయాన్
సీఅండ్‌సీ1:	జనక అయితే గనక
సీఅండ్‌సీ2:	స్వాగ్
శ్రీప్రియ:	మార్టిన్
పద్మప్రియ:	దేవర
సూర్య (వాకలపూడి):	దేవర
సూర్య2:	విశ్వం

నేటి తరానికి స్ఫూర్తి అబ్దుల్ కలాం



కలాం చిత్రపటానికి నివాళులర్పించిన యంగ్ మైండ్స్ ప్రతినిధులు, విద్యార్థులు



నడకుదురు హైస్కూలులో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బాలాజీచెరువు: నేటి తరానికి స్ఫూర్తి డాక్టర్ అబ్దుల్ కలాం అని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పిల్లి గోవిందరావు పేర్కొన్నారు. స్థానిక గాంధీభవన్‌లో యంగ్ మైండ్ రేపటి తరం కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేటి తరానికి కలాం స్ఫూర్తి అని, ఆయన చేసిన ప్రయోగాలు మన దేశ కీర్తి ప్రతిష్టలు పెంచాయన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వాకాడ చిన్న మాట్లాడుతూ సైన్స్ ప్రయోగాలతో అద్భుతాలు సృష్టించవచ్చని, ప్రతి విద్యార్థి సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. భారతదేశ క్షిపణి పితామహుడిగా కలాం అందరికీ స్ఫూర్తి దాయకంగా నిలిచారని, అలాగే మంచి రచయితగా విద్యార్థి లోకానికి రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలో దేశం పురోభివృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, బట్టీపట్టే విధానానికి స్వస్తిపలికి సృజనాత్మకంగా ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మిసైల్ మేన్ కలాంకు నివాళి

కాకినాడ రూరల్: భారత క్షిపణి పితామహుడు అబ్దుల్ కలాం జయంతిని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో మంగళవారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి మాజీ సైనిక ఉద్యోగి శ్రీనగేష్, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా, సత్యనారాయణ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనగేష్ మాట్లాడుతూ 1931 అక్టోబరు 15 అబ్దుల్ కలాం జన్మించారని, దేశ రక్షణ, అంతరిక్ష పరిశోధనలపై తనదైన ముద్ర వేశారన్నారు. పద్మ భూషణ్, పద్మ విభూషణ్, భారత రత్న వంటి అత్యున్నత పురస్కారాలను ఆయన అందుకుని యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు.

కరప: మండలం నడకుదురులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం 94వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టి.మురళీబాబు మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పృథ్వీ, అగ్ని, ఆకాశ్, త్రిశూల్ వంటి క్షిపణులు అందించిన అబ్దుల్ కలాం దేశ ప్రతిష్టను ఇనుమడింప చేశారని పలువురు కొనియాడారు. మిసైల్ మ్యాన్ ఆఫ్‌ది ఇండియాగా పిలిచే అబ్దుల్ కలాం ఆదర్శ ప్రాయుడన్నారు. ఉపాధ్యాయులు వాకాడ వెంకటరమణ, పీఈటీ లక్ష్మి, కె.దుర్గారావు, అరుణ తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న శ్రీనగేష్, అడబాల తదితరులు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కరప: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన ఒక యువకుడు కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మండలం వేములవాడ గ్రామానికి చెందిన పెరుమాళ్ల జాన్ (19) కరప సమీపంలోని ఒక పెట్రోల్‌బంక్‌లో పని చేస్తున్నాడు. నీరసంగా ఉందని చెప్పి నాలుగు రోజులుగా డ్యూటీకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండిపోయాడు. సోమవారం డ్యూటీకి వెళుతున్నానని ఇంటివద్ద చెప్పిన జాన్ అదే రోజు సాయంత్రం యండమూరు గ్రామ సమీపంలోని పంట పొలాల్లో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతన్ని గొల్లపాలెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేకనే జీవితంపై విరక్తిచెంది పురుగుల మందు తాగినట్టు తండ్రి వాసు పోలీసులకు తెలిపాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ యజమానులకు పని కల్పించండి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న లారీ యజమానులు

కాకినాడ సిటీ: కాకినాడ లారీ యజమానుల సంఘం అందరికీ సమాన పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట సంఘానికి చెందిన కొందరు లారీ యజమానులు ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. కాకినాడ పోర్టులో ఎగుమతి దిగుమతులు బాగా తగ్గాయని అందువల్ల తమకు ఉపాధి కరువై చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే తమ సభ్యుల అనుమతులు లేకుండా ఒక యూనియన్ ఎంపిక జరిగిందని అది తమ నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో దాన్ని రద్దు చేసి తిరిగి ఎన్నికలు నిర్వహించేలా ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీలను కోరామన్నారు. ఈ యూనియన్‌లో కొందరు సభ్యులు గతంలో సంఘానికి చెందిన నగదు దుర్వినియోగానికి పాల్పడి అవకతవకలు చేశారన్నారు. దీనిపై ఎమ్మెల్యే నానాజీ వారం రోజుల్లో మంచి నిర్ణయం తీసుకుంటామన్నారని వివరించారు. ఇదే యూనియన్ కొనసాగితే తాము రూరల్‌లో వేరే యూనియన్ పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో లారీ యజమానులు కడియాల అంజిబాబు, గూడవల్లి మృత్యుంజయరావు, గుమ్మెళ్ల సత్తిబాబు, శేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాకినాడ రోడ్డులో ట్రాఫిక్ జామ్



వీకే రాయపురం–మాధవపట్నం మధ్య నిలిచిపోయిన వాహనాలు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో వీకే రాయపురం–మాధవపట్నం మధ్యలో మంగళవారం ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ఈ రోడ్డులో పెద్ద గోతులు ఎక్కువగా ఉండటం, సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురియడంతో గోతుల్లో నీరు చేరింది. దీంతో ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక వాహన చోదకులు నెమ్మదిగా వెళ్లడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ రోడ్డులో గోదావరి, ఏలేరు నీరు ఉధృతంగా ప్రవహించి రోడ్డుపైకి నీరు రావడంతో వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. రెండు రోజుల క్రితం కాకినాడ నుంచి మోటారు సైకిల్‌పై వస్తున్న దంపతుల మోటారు సైకిల్ గోతిలో పడడంతో అదుపు తప్పి కింద పడిన మహిళ అక్కడకక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఇంత జరుగుతున్నా అధికారులు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

జవాబుదారీ లేని సమావేశాలు ఎందుకు?



సమావేశంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు



వివిధ శాఖల పనితీరుపై సమీక్ష జరుపుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీఓ అనుపమ

- ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు విలువ శూన్యం
- శాఖల పనితీరుపై సభ్యుల ఆగ్రహం
- కరప మండల సర్వసభ్య సమావేశం

కరప: ఏ శాఖ ద్వారా ఏ పని జరుగుతుందో తెలియడంలేదు. అడుగుదామంటే ఎవరూ అందుబాటులో ఉండరు. ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు విలువ ఉండటంలేదు. అటువంటప్పుడు జవాబుదారీ తనంలేని ఈ సమావేశాలు ఎందుకు అంటూ సభ్యులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ఏర్పాటుచేసి, అందరికీ తెలియజేస్తాం, అప్పటికీ వినకపోతే తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఎం.అనుపమ సర్దిచెప్పడంతో సభ్యులు శాంతించారు. అనంతరం మండల సమావేశాన్ని సాదా సీదాగా సమీక్షించి మమ అనిపించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా ఎంపీపీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండల పరిధిలో 11,460 మందికి రూ.4.79 కోట్లు పింఛన్లు ఇస్తున్నట్టు తెలిపారు. ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా గ్రామాల్లో 59 అభివృద్ధి పనులు చేసేందుకు గుర్తించి, తీర్మానాలు చేయడం జరగిందన్నారు. పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలను ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించి, ఆయా పనులకు భూమిపూజ చేసి, వచ్చే జనవరి నాటికి పూర్తి చేయనున్నారు. తర్వాత వివిధ శాఖల ద్వారా మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆగస్టు నెలలో పంచాయతీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు ఒకే రోజు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, చేయాల్సిన పనులను గుర్తించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు పెద్దాపురప్పాడు గ్రామ ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కనిపించడం లేదని, పంచాయతీకి ఏ విధమైన సమాచారం అందించడం లేదని, ప్రతి వారం నిర్వహించాల్సిన ఉపాధి కూలీల సమావేశం కూడా జరపడంలేదని, అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆ గ్రామ సర్పంచ్ బిరుదా సరస్వతి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ అనుపమ కల్పించుకుని బదిలీపై మండలానికి ఈ మధ్యనే వచ్చానని, ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేసి, అన్నీ సరిచేస్తామని, వినకపోతే ఎటువంటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. తగిన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో సర్పంచ్, ఎంపీటీసీలు శాంతించారు. వేములవాడలో మంచినీటి కుళాయిల నుంచి మట్టి, బురదనీరు వస్తోందని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ అనసూరి శ్రీనివాసరావు, వలసపాకల సర్పంచ్ వాసంశెట్టి రామారావు చెప్పగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఎ.వర్ధన్ మాట్లాడుతూ పైప్‌లైన్‌లో మట్టి పేరుకుపోతే కుళాయిలు వదిలిన వెంటనే అలా వస్తుందని, పైప్‌లైన్ శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుని, రక్షిత నీటిని సరఫరా చేస్తామన్నారు. ఎంఏఓ ఏవీ రాజేష్ మాట్లాడుతూ వారానికి రెండు రోజులు పొలం పిలుస్తోంది నిర్వహించి, అన్ని గ్రామాల్లోని రైతులకు సాగు మెళకువలు వివరించనున్నట్టు తెలిపారు. తొలకరి సీజన్‌లోనే సాగునీటి ఎద్దడిని ఎదుర్కొన్నామని, రబీలో ఇంకెన్ని ఇబ్బందులు పడాలోనని సభ్యులు చెప్పడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి, రబీలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంఏఓ తెలిపారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూల మాలలువేసి, సభ్యులు, అధికారులు నివాళులర్పించారు. ఎంపీడీఓ అనుపమ, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, ఏఓ ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, మండల వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్‌నాయక్, ఇంజినీరింగ్ అధికారి ఈఓ పీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, ఏపీఎం ఎంఎస్‌బీ దేవి తదితరులు పాల్గొన్నారు.

పిడుగులతో అప్రమత్తం

- వర్షాలతో పొంచి ఉన్న ముప్పు
- జాగ్రత్తలతో ప్రమాదాలు నివారించవచ్చని సూచిస్తున్న శాస్త్రజ్ఞులు

కాకినాడ సిటీ: గతంలో పిడుగుపాటుకు ఒకరు మృతి అని ఒకటీ అరా వార్తలు వినేవాళ్లం. భౌగోళిక పరిస్థితులు మారిపోయాయి. కాలాలు తారుమారవుతున్నాయి. ఏ కాలం నడుస్తోందో తెలియని పరిస్థితి నెలకొంది. ఎండలూ, వానలూ, చలీ అన్నీ ఎక్కువగానే నమోదవుతూ మానవాళిపై విరుచుకు పడుతున్నాయి. ఈ ఏడాది పిడుగుల వల్ల జిల్లాలో 15 మందికి పైగా మరణించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వందల సంఖ్యలో మూగజీవాలను సైతం పొట్టన పెట్టుకున్నాయి పిడుగులు. మారిన పరిస్థితుల దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాలకు ముప్పు ఉండదని పర్యావరణ శాస్త్రజ్ఞులు చెప్తున్నారు.

ఆస్తి, ప్రాణ రక్షణ ఇలా..

రాగి, ఇత్తడి లోహాలు ఉరుముల్ని ఆకర్షిస్తాయి. పిడుగులు పడకుండా ఇళ్లపై రాగి తీగలు ఏర్పాటు చేసుకుంటే ఆస్తినష్టంతో పాటు ప్రాణ నష్టం తప్పుతుంది. ఎందుకంటే పిడుగు ఉండే ధనావేశ విద్యుత్ నేలకు అనుసంధానించిన రాగి తీగను తాకడం వల్ల తటస్థం అవుతుంది.

శబ్దం నుంచి రక్షణ

పిడుగుపడే ముందు మెరుపు మెరుస్తుంది. తరువాత కొంత సేపటికి భారీ శబ్దంతో కూడిన ఉరుము వస్తుంది. దాన్ని మన చెవులు తట్టుకోలేవు. కొన్నిసార్లు కర్ణబేరి పగలడమో, శాశ్వత చెవుడు ఏర్పడటమో జరుగుతుంది. అటువంటి సమయంలో చెవులు మూసుకుని నోరు తెరవాలి. దీని వల్ల ఆ శబ్దం చెవి నుంచి నోటి ద్వారా బయటకు ప్రసారం అవుతుంది. అందుకే పెద్దవారు పిడుగు పడే సమయంలో నోరు తెరిచే విధంగా అర్జునా.. ఫల్గుణా అని అనమంటారు. సైన్స్‌నే పెద్దలు ఆ విధంగా చెప్పి ఉంటారని అర్థం చేసుకోవచ్చు.

పనికట్టేదిలా..

ప్రస్తుత ఆధునిక సాంకేతికతతో వాతావరణ శాఖ నిపుణులు అందిస్తున్న సమాచారం మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు ఎక్కడ పిడుగుపడే ప్రమాదం ఉందో తెలుసుకుని ప్రజలను హెచ్చరించవచ్చు. అలాగే ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారాన్ని పంపవచ్చు.

తూరంగిలో పడిన పిడుగు

మంగళవారం తెల్లవారుజామున కాకినాడ రూరల్ మండలం తూరంగి అయ్యప్పస్వామి గుడి సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకొని తాటిచెట్టుపై పిడుగు పడి పూర్తిగా కాలిపోయింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పెద్ద శబ్దంతో పిడుగు పడి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో సమీపంలోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.



తూరంగి అయ్యప్పస్వామి గుడి సమీపంలో పిడుగు పడి పూర్తిగా కాలిపోయిన తాటిచెట్టు

పిడుగు అంటే..

పిడుగును ఇంగ్లిష్‌లో థండర్ స్టోన్ అంటారు. మేఘాలు ఢీకొన్నప్పుడు వెలువడే కాంతిని మెరుగు అని, శబ్దాన్ని ఉరుము అంటారు. ఈ సమయంలో వెలువడే విద్యుత్‌ను పిడుగు అంటారు. ఇందులో దాదాపు 30 కోట్ల ఓల్టుల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

తప్పించుకోవడం ఎలా

- వర్షాలు పడుతున్న సమయంలో సెల్‌ఫోన్, ఎఫ్ఎం రేడియో వాడకూడదు.
- భారీ వర్షం పడే సమయంలో కారులోనే ఉండడం క్షేమం.
- వీలైతే పొడి భూమిపైకి వెళ్లాలి.
- ప్రాణాల్ని రక్షించుకునే అవకాశం లేనప్పుడు తలను మోకాళ్లపై ముడుచుకుని కూర్చోవాలి. దాంతో పిడుగు మనపై పడే అవకాశం తగ్గుతోంది.
- చెట్లు, టవర్ల కిందకు వెళ్లకూడదు.
- ఉరుముల సమయంలో బైక్‌లు నడపకూడదు.
- అరికాళ్లను భూమిపై పెట్టకుండా వేళ్లపై కూర్చోవాలి.
- నీరున్న ప్రాంతం నుంచి దూరంగా వెళ్లిపోవాలి.
- ఇంట్లో ఎలక్ట్రానిక్ పరికరాలు ఆఫ్ చేయాలి. ప్లగ్‌లు తీసేసి ఉంచాలి.
- మెరుపులు, ఉరుముల సమయంలో స్నానం చేయకూడదు. అంట్లు తోమ కూడదు.
- పిడుగుపాటుకు గురైన వారికి వెంటనే చికిత్స అందించాలి